## కోర్టు ప్రాంగణంలో కాల్పులు

### పోలీసుల సమక్షంలోనే హత్యకేసు నిందితుడి కాల్చివేత

పాట్నా, డిసెంబర్ 15: బీహార్‌లో పట్టపగలు కోర్టు ప్రాంగణంలో హత్య జరిగింది. ఓ హత్య కేసులో నిందితుడైన అభిషేక్ కుమార్ అలియాస్ చోటే సర్కార్‌ను పాట్నాలోని ఓ కోర్టులో హాజరుపర్చడానికి పోలీసులు తీసుకొచ్చారు. అతడిని వ్యాన్ నుంచి కిందకు దించగానే ఇద్దరు వ్యక్తులు కాల్పులు జరిపారు. దీంతో అభిషేక్ కుమార్ అక్కడికక్కడే మరణించాడు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు నిందితులిద్దరిని అరెస్టు చేశారు. పాతకక్షలే హత్యకు కారణమని పోలీసులు అనుమానిస్తున్నారు.

## పాక్‌లో ఉగ్రదాడి.. ఐదుగురు పోలీసుల మృతి

పెషావర్, డిసెంబర్ 15: పాకిస్థాన్‌లో ఉగ్రదాడులు పెరిగిపోతున్నాయి. ఖైబర్ ఫఖ్తున్‌ఖ్వా రాష్ట్రంలో మూడు రోజుల కిందట జరిగిన ఉగ్రదాడిలో 23 మంది సైనికులు మరణించిన విషయం మరువక ముందే శుక్రవారం రెండు చోట్ల ఉగ్రదాడులు జరిగాయి. ఈ దాడుల్లో ఐదుగురు పోలీసులు మరణించారు. తొలుత ఖైబర్ ఫఖ్తున్‌ఖ్వా రాష్ట్రంలోని పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌పై ఓ ఉగ్రవాది ఆత్మాహుతి దాడికి పాల్పడ్డారు. దీంతో ముగ్గురు పోలీసులు ప్రాణాలు కోల్పోయారు. నలుగురు ఉగ్రవాదులు హతమయ్యారు. అలాగే ఖైబర్ ట్రైబల్ జిల్లాలో భద్రతా దళాల చెక్‌పోస్ట్ లక్ష్యంగా జరిపిన దాడిలో ఇద్దరు పోలీసులు మృతిచెందారు.

## చెక్ రిపబ్లిక్ కోర్టును ఆశ్రయించండి

### పన్నూ హత్య కుట్ర కేసులో అరెస్టు అయిన గుప్తాకు సుప్రీం సూచన

న్యూఢిల్లీ, డిసెంబర్ 15: ఖలిస్థాన్ ఉగ్రవాది గుర్‌పత్వంత్ సింగ్ పన్నూను చంపడానికి కుట్ర పన్నిన కేసులో అరెస్టు అయిన భారతీయుడు నిఖిల్ గుప్తా మన సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. గుప్తాను అక్రమంగా అరెస్టు చేశారని, ఈ కేసులో వెంటనే జోక్యం చేసుకోవాలని కోరుతూ అతడి కుటుంబసభ్యులు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన ధర్మాసనం విదేశాల్లో జరిగిన అరెస్టులో తాము జోక్యం చేసుకోలేమని తెలిపింది. ఒకవేళ అతడి అరెస్టు అక్రమమైతే లేదా మానవ హక్కుల ఉల్లంఘన జరిగినట్టు భావిస్తే వెంటనే చెక్ రిపబ్లిక్‌లోని కోర్టును ఆశ్రయించాలని సూచించింది.

### ఇంధనం ఆదా చేసుకునేలా

## గూగుల్ మ్యాప్‌లో కొత్త ఫీచర్!



*న్యూఢిల్లీ, డిసెంబర్ 15: గూగుల్ మ్యాప్ మరింత సౌకర్యవంతంగా, యూజర్ ఫ్రెండ్లీగా మార్చేందుకు సరికొత్త ఫీచర్‌ను అందుబాటులోకి తీసుకొస్తున్నట్టు గూగుల్ కంపెనీ ప్రకటించింది. ప్రయాణికులు తమ వాహనాల్లోని ఇంధనాన్ని మరింతగా ఆదా చేసుకునేందుకు కొత్త ఫీచర్ (రూట్ ఆప్షన్)ను తీసుకొస్తున్నట్టు శుక్రవారం మీడియాకు ఒక ప్రకటన విడుదల చేసింది. దీని ప్రకారం.. వాహనం ఇంజిన్‌ను అనుసరించి ఎకో ఫ్రెండ్లీ రూట్ (ఇంధనం ఖర్చు తక్కువ అయ్యే మార్గం), ఎక్కువ ఇంధనం తీసుకునే 'ఫాస్టెస్ట్ రూట్'ను గూగుల్ మ్యాప్ చూపుతుందట. కర్బన ఉద్గారాల్ని తగ్గించటంలోనూ ఇది సహాయపడుతుందని గూగుల్ పేర్కొన్నది. భారత్ సహా ఎంపిక చేసిన దేశాల్లో సరికొత్త ఫీచర్‌తో కూడిన గూగుల్ మ్యాప్ త్వరలో అందుబాటులోకి వస్తుందని కంపెనీ వర్గాలు తెలిపాయి.*

## • హైస్పీడ్ యూఏవీ పరీక్ష సక్సెస్



*దేశీయంగా అభివృద్ధి చేసిన హైస్పీడ్ ఫ్లయింగ్ వింగ్ మానవ రహిత ఏరియల్ వెహికల్ (యూఏవీ)ను కర్ణాటకలోని చిత్రదుర్గలో ఉన్న ఏరోనాటికల్ టెస్ట్ రేంజ్ నుంచి విజయవంతంగా పరీక్షించినట్టు రక్షణ శాఖ వెల్లడించింది. ఈ యూఏవీని డీఆర్డీవో అభివృద్ధి చేసింది. దేశ సాంకేతిక పురోగతికి ఇది మరో నిదర్శనమని రక్షణ శాఖ పేర్కొన్నది.*

## యోగా తరహాలో ఆయుర్వేదానికి ప్రాచుర్యం

### డీఆర్‌డీవో మాజీ చైర్మన్ జీ సతీశ్ రెడ్డి




గోరఖ్‌పూర్, డిసెంబర్ 14: ప్రపంచ వ్యాప్తంగా మన యోగాకు ఎంతో పేరు వచ్చిందని, అదే తరహాలో ఆయుర్వేద ఔషధాలకు కూడా ప్రాచుర్యం కల్పించాలని డీఆర్‌డీవో మాజీ చైర్మన్ జీ సతీశ్ రెడ్డి అన్నారు. గోరఖ్‌పూర్‌లోని మహాయోగి గోరఖ్‌నాథ్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో 'సహజ ఉత్పత్తుల నుంచి ఔషధాల తయారీలో పరిశోధనలు, అవకాశాలు, అభివృద్ధి' అనే అంశంపై జరిగిన జాతీయ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. సహజ సిద్ధ ఔషధాలు దేశానికి ఎంతో అవసరమని అన్నారు. ప్రకృతి సిద్ధంగా లభించే వస్తువుల నుంచి ఔషధాల తయారీపై విస్తృతంగా పరిశోధనలు జరగాలన్నారు. ప్రధాని ప్రవేశపెట్టిన ఆత్మనిర్భర్‌లో ఆయుర్వేదాన్ని భాగస్వామిని చేసేందుకు విస్తృతమైన అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ కొవిడ్ సమయంలో మహమ్మారిపై పోరాటంలో డీఆర్‌డీవో చైర్మన్‌గా సతీష్ రెడ్డి చేసిన కృషిని ప్రశంసించారు.

# రాఫెల్‌పై మళ్లీ వివాదం!

## ఫ్రాన్స్ జడ్జీల విచారణకు సహకరించని కేంద్రం!

### సమాచారం ఇవ్వకుండా మోదీ సర్కారు అడ్డంకులు

### పరిశోధనాత్మక వెబ్‌సైట్ 'మీడియాపార్ట్' కథనం



న్యూఢిల్లీ, డిసెంబర్ 15: రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలు ఒప్పందంపై మళ్లీ వివాదం రేగుతున్నది. ఫ్రాన్స్‌కు చెందిన దసాల్ట్ ఏవియేషన్ నుంచి 36 రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలుకు 2016లో భారత ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందంలో అక్రమాలు చోటుచేసుకున్నాయని ఆరోపణలున్న సంగతి తెలిసిందే. దీనిపై ఫ్రాన్స్ న్యాయమూర్తులు విచారణ జరుపుతున్నారు. అయితే ఈ విచారణకు సహకరించేందుకు మోదీ సర్కారు తిరస్కరిస్తున్నదని ఫ్రాన్స్‌కు చెందిన పరిశోధనాత్మక వెబ్‌సైట్ మీడియా పార్ట్ సంచలన కథనం ప్రచురించింది. భారత్‌కు ఫ్రాన్స్ మాజీ రాయబారి అయిన ఎమ్మాన్యుయేల్ లెనైన్ రాసిన దౌత్యపరమైన నోట్‌ను ఈ సందర్భంగా ప్రస్తావించింది. క్రిమినల్ కేసుల్లో భారత్ సహకారంలో ఎదురవుతున్న సవాళ్లను ఆయన అందులో ప్రస్తావించారు. భారత్ నుంచి అసంపూర్తి స్పందనలు, వివరాలు అందించడంలో జాప్యంపై ఫ్రెంచ్ అధికారులు ఆందోళన వ్యక్తం చేశారని మీడియా పార్ట్ తన తాజా కథనంలో పేర్కొన్నది. 'చాలా కేసులను మన భారత భాగస్వామ్యులు చాలా జాప్యం చేస్తారు. అదేవిధంగా ఆ వివరాలు కూడా చాలా అసంపూర్తిగా ఉంటాయి' అని లెనైన్ తన నోట్‌లో పేర్కొన్నారని తెలిపింది.

### పత్రాలివ్వని మోదీ సర్కారు

రాఫెల్ డీల్‌లో చోటుచేసుకున్న అవినీతి, పక్షపాతం, అధికార దుర్వినియోగం వంటి ఆరోపణలపై దర్యాప్తునకు సహకరించాలని ఫ్రాన్స్ జడ్జీలు 2022 నవంబర్‌లో అంతర్జాతీయ సహకారం కోసం అభ్యర్థించారని, అయితే దీనికి మోదీ సర్కారు తిరస్కరించిందని మీడియా పార్ట్ పేర్కొన్నది. దసాల్ట్, అనిల్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ గ్రూపు జాయింట్ వెంచర్ అయిన దసాల్ట్ రిలయన్స్ ఏరోస్పేస్ లిమిటెడ్(డీఆర్ఏఎల్), ఇతర కీలక కార్యాలయాల్లో సోదాలు చేపట్టాలని, ఒప్పందానికి సంబంధించిన జ్యుడీషియల్ పత్రాలు అందించాలని జడ్జీలు కోరారని, అయితే ఆ అభ్యర్థన తిరస్కరణకు గురైందని పేర్కొన్నది.

### అక్రమంగా అంబానీ కంపెనీకి!

*ప్రధాని మోదీ పారిస్‌లో రాఫెల్ డీల్‌ను ప్రకటించే దానికి కేవలం 12 రోజుల ముందు అనిల్ అంబానీ రిలయన్స్ డిఫెన్స్ వెంచర్‌ను ప్రారంభించారని, ప్రభుత్వ రంగ హెచ్ఏఎల్ ప్రయోజనాలను పణంగా పెట్టి మోదీ సర్కార్ అంబానీకి వేలాది కోట్ల రూపాయల ఒప్పందాన్ని కట్టబెట్టిందనే ఆరోపణలు ఉన్నాయి. ఆగస్టా వెస్ట్ ల్యాండ్ చాపర్ స్కామ్‌లో ఈడీ అరెస్టు చేసిన వ్యాపారవేత్త సుశేన్ గుప్తా.. రాఫెల్ డీల్‌లో కూడా ఏజెంట్‌గా ఉన్నారని, ఆయనకు పెద్ద యెత్తున కమీషన్ అందిందని మీడియా పార్ట్ గతంలో ప్రచురించిన ఓ కథనంలో పేర్కొన్నది.*

## కోర్టుల్లో 5 కోట్లకుపైగా కేసులు పెండింగ్: కేంద్రం

న్యూఢిల్లీ, డిసెంబర్ 15: దేశవ్యాప్తంగా కోర్టుల్లో 5 కోట్లకుపైగా కేసులు పెండింగ్‌లో ఉన్నాయని కేంద్రమంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ చెప్పారు. శుక్రవారం ఆయన లోక్‌సభలో మాట్లాడుతూ ఈ కేసుల్లో దాదాపు 80,000 కేసులు సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్నాయని వెల్లడించారు. అలాగే 61 లక్షలకుపైగా కేసులు హైకోర్టుల్లో, 4.46 కోట్లకుపైగా కేసులు జిల్లా, సబార్డినేట్ కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు.

### మహిళా రిజర్వేషన్లు తక్షణమే అమలుచేయాలన్న

## పిటిషన్ కొట్టివేత

న్యూఢిల్లీ, డిసెంబర్ 15: వచ్చే ఏడాది లోక్‌సభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించే మహిళా రిజర్వేషన్ చట్టాన్ని అత్యవసరంగా, నిర్ణీత కాలపరిమితితో అమలు చేయాలని కోరుతూ ఓ మహిళా న్యాయవాది దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించేందుకు ఢిల్లీ హైకోర్టు నిరాకరించింది. ఈ విషయంలో పిటిషనర్‌కు వ్యక్తిగత ఆసక్తి ఏమీ లేదని గమనించిన జస్టిస్ సుబ్రమణియం ప్రసాద్.. ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేయాలని కోరారు. ఈ విషయంలో మీకున్న ఆసక్తి ఏమిటని పిటిషనర్‌ను ప్రశ్నించారు. ఇది పూర్తిగా ప్రజాప్రయోజనానికి సంబంధించినదని పేర్కొన్నారు. స్పందించిన పిటిషనర్ తరపు న్యాయవాది.. ఆమె మొత్తం మహిళలకు ప్రాతినిధ్యం వహిస్తున్నట్టు పేర్కొన్నారు. పిల్ దాఖలు చేసే స్వేచ్ఛతో పిటిషన్‌ను ఉపసంహరించుకునేందుకు అనుమతినిచ్చారు. కేంద్రం తరపు న్యాయవాది మాట్లాడుతూ మహిళా చట్టం అమలుకు సంబంధించిన విషయం ప్రస్తుతం సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్నట్టు తెలిపారు.

## లేట్ నైట్ తింటే గుండెపోటు ముప్పు!

*న్యూఢిల్లీ, డిసెంబర్ 15: మీరు రాత్రి భోజనం లేటుగా తింటారా? అయితే మీకు గుండెపోటు ముప్పు ఉన్నట్టే. రాత్రి 9 గంటల తరువాత భోజనం చేసే వారికి హార్ట్ ఎటాక్ వచ్చే ప్రమాదం 28 శాతం ఎక్కువని తాజా అధ్యయనంలో తేలింది. రాత్రి 8 గంటల లోపు భోజనం చేసేవారితో పోలిస్తే, లేటుగా భోంచేసేవారికి వచ్చే కష్ట నష్టాలపై ఫ్రాన్స్‌లో లక్ష మందిపై అధ్యయనం చేశారు. ఏడు సంవత్సరాలు వారి ఆహారపు అలవాట్లను, ఆరోగ్య పరిస్థితులను పరిశీలించారు. రాత్రి 9 గంటల తరువాత భోజనం చేసిన వారికి గుండెపోటు సమస్యలు, మినీ స్ట్రోక్ (తాత్కాలిక ఇస్కీమిక్ అటాక్)లు వచ్చినట్లు గుర్తించారు.*

## రాజస్థాన్ సీఎంగా భజన్‌లాల్ ప్రమాణం



జైపూర్, డిసెంబర్ 15: రాజస్థాన్ నూతన ముఖ్యమంత్రిగా భజన్‌లాల్ శర్మ శుక్రవారం ప్రమాణస్వీకారం చేశారు. జైపూర్‌లోని చరిత్రాత్మక ఆల్బర్ట్ హాల్ ఎదురుగా జరిగిన ఈ కార్యక్రమంలో సీఎంగా భజన్‌లాల్‌తో పాటు డిప్యూటీ సీఎంలుగా దియా కుమారి, ప్రేమ్‌చంద్ బైరవాలతో గవర్నర్ కల్‌రాజ్ మిశ్రా ప్రమాణం చేయించారు. ఈ కర్యాక్రమానికి ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, పలువురు కేంద్ర మంత్రులు, పలు బీజేపీ పాలిత రాష్ట్రాల సీఎంలు, బీజేపీ జాతీయాధ్యక్షుడు జేపీ నడ్డా తదిరులు హాజరయ్యారు. తన పుట్టిన రోజు నాడునే భజల్‌లాల్ శర్మ రాష్ట్ర సీఎంగా బాధ్యతలు స్వీకరించడం విశేషం. ఈ కార్యక్రమానికి కొంచెం ముందుగానే హాజరైన మాజీ సీఎం అశోక్ గెహ్లాట్.. తన రాజకీయ ప్రత్యర్థి అయిన కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ పక్కనే కూర్చొని ముచ్చట్లు పెట్టడం అందరినీ ఆకర్షించింది.

## మూడేండ్లుగా కరోనా.. సూసైడ్ కోసం వినతి

### నరకం నుంచి విముక్తి కోసం కెనడా మహిళ దరఖాస్తు

టొరంటో, డిసెంబర్ 15: దీర్ఘకాలిక కరోనా బారిన పడ్డ ఓ మహిళ.. తాను ఆ నరకాన్ని భరించలేనని, సూసైడ్ కోసం అనుమతి ప్రసాదించాలని కోర్టును ఆశ్రయించింది. వివరాల్లోకెళితే.. కెనడాకు చెందిన ట్రేసీ థాంప్సన్ 2020 మేలో కొవిడ్ బారిన పడ్డారు. అప్పటి నుంచి కొన్ని రోజుల పాటు కరోనా లక్షణాలు సాధారణంగానే ఉండేవి. ఆ తర్వాత వాటి తీవ్రత పెరిగి, ఆమె బెడ్‌కు పరిమితం అయ్యేలా చేసింది. ఓ సందర్భంలో 36 గంటల పాటు శ్వాస తీసుకోవటానికి కూడా తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. దీర్ఘకాలిక కొవిడ్‌కు చికిత్స ఏమిటో తెలియక వైద్యులు కూడా చేతులెత్తేసిన రోజులున్నాయి. ఏం తిన్నా అలర్జీకి దారితీసేది. ఇన్ని రోజులుగా బెడ్‌కే పరిమితమైన థాంప్సన్ చేతిలో ఉన్న డబ్బంతా అయిపోతున్నది. దీంతో తన దుస్థితిని అర్థం చేసుకొని సూసైడ్‌కు అనుమతి ఇవ్వాలని, తనకు మంచి చావును ప్రసాదించాలని దరఖాస్తు చేసుకున్నది.